మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాకేశ్

యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకోం

జహీరాబాద్, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికొస్తే సహించేది లేదని జహీరాబాద్ బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాకేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని బీఆర్‌ఎస్వీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల అటవీ ప్రాంతంలోని భూములను బుల్డోజర్లతో చదును చేసి భూదందాకు తెరలేపారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ర్టాన్ని అప్పుల పాలు చేసి తన తమ్ముళ్లకు సెంట్రల్ యూనివర్సిటీ భూములను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని విద్యార్థులు, ప్రతిపక్ష పార్టీల నేతలు ఆందోళనలు చేస్తే పోలీసులతో అక్రమంగా అరెస్టు చేసి భయాందోళనకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది బుల్డోజర్ ప్రభుత్వమా.. ప్రజా ప్రభుత్వమా అని ఎద్దేవా చేశారు. విద్యార్థి లోకంతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాధించిన దాఖలాలు లేవన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో ప్రకృతి విధ్వంసాన్ని నాశనం చేస్తూ అక్కడ ఉంటున్న జీవరాశిని మనుగడ లేకుండా చేసే ప్రయత్నాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ భూముల జోలికి రావద్దని, పనికిమాలిన చర్యలు చేపడితే బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ నాయకులు ఓంకార్, పరుశురాం, మారుతీయాదవ్, రాఘుతేజ, అజీమ్, ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులు, నిర్బంధాన్ని వ్యతిరేకించాలి

జహీరాబాద్, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను పోలీసులు నిర్బంధించి, అక్రపంగా అరెస్టు చేయడంపై సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాంచందర్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం హైదరాబాద్‌లో సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకలు ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా జహీరాబాద్ పోలీసులు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాంచందర్‌ను ఆరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలపై ప్రశ్నించే నాయకులను నిర్బంధిస్తుందని విమర్శించారు. విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాల్సిన దశలో ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కు తీసుకొని అమ్మకానికి పెట్టిందన్నారు. ప్రభుత్వం యూనివర్సిటీ భూముల అమ్మకాలను వెంటనే విరమించుకోవాలని, అరెస్టు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూలో భూముల వేలాన్ని ఆపాలి

రామచంద్రాపురం, ఏప్రిల్ 1: హెచ్‌సీయూలో భూముల వేలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌సీయూకి పక్కనే ఉన్న అటవి భూమిలోకి రాత్రికి రాత్రి వందలాది జేసీబీలను పంపి పచ్చని చెట్లను తొలిగించడం దుర్మార్గమని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం విద్యార్థులు నిరసనలు చేపడుతుంటే పోలీసులు విద్యార్థులపై క్రూరంగా వ్యవహరించడం సరికాదన్నారు. జేసీబీల దాటికి మూగజీవాలు బిక్కు బిక్కుమంటూ ఆర్తనాదాలు చేస్తున్న ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కనీసం చలనం కూడా లేదని విమర్శించారు. ప్రకృతిని, వన్యప్రాణులను సంరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతిపై చేపడుతున్న విధ్వంసాన్ని వెంటనే ఆపాలని డియాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఈ విషయాన్ని ఖండించాలని ఆయన కోరారు.

కేతకిలో పూజలు చేస్తున్న కర్ణాటక ఎమ్మెల్సీలు, మాజీమంత్రి

కేతకీలో ఎమ్మెల్సీల ప్రత్యేక పూజలు

ఝరాసంగం, ఏప్రిల్ 1: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం కర్ణాటక రాష్ట్రం ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ పాటిల్, భీంరావ్ పాటిల్, మాజీ మంత్రి రాజశేఖర్ పాటిల్ కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదచారణ చేసి గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం మాజీ మంత్రి రాజశేఖర్ పాటిల్ రూ.51 వేల నగదును ఆలయ ఈవోకు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప వారికి పూలమాల శాలువాతో సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, మం డల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, శేఖర్ పాటిల్,మల్లయ్య స్వామి, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

డ్రైవర్‌కు అండగా బీఆర్టీయూ నాయకుడు

జిన్నారం, ఏప్రిల్ 1: బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కార్మికుడికి బీఆర్టీయూ నాయకులు అండగా నిలిచారు. డ్రైవర్ రాజు యాదవ్ బొల్లారంలోని ఓ పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. యాజమాన్యం అకారణంగా పనిలోంచి తీసివేసి వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని డ్రైవర్ రాజు యాదవ్ బీఆర్టీయూ నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత రవిసింగ్‌ను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఆయన పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి రాజు యాదవ్‌కు రావాల్సిన ఒక నెల వేతనాన్ని అందించేందుకు కృషి చేశారు. కష్టకాలంలో అండగా నిలిచిన బీఆర్టీయూ నాయకుడికి డ్రైవర్ రాజు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ ఉన్నారు.


డ్రైవర్ రాజు యాదవ్‌కు నెల వేతనం అందిస్తున్న రవిసింగ్

నిరాహార దీక్షలో పాల్గొన్న అనంతారం ముదిరాజ్ సంఘం సభ్యులు, జేఏసీ నాయకులు

డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేయండి

గుమ్మడిదల, ఏప్రిల్1: ప్యారానగర్ డంపింగ్‌యార్డు (ఎంఎస్‌బ్ల్యూ)కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో డంపింగ్ యార్డుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని గుమ్మడిదలలో 56 రోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షలో అనంతారం గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు. వీరికి జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 56 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించకపోవడం విచారకరమన్నారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో 56వ రోజు రిలే నిరాహార దీక్షలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేసి ఇక్కడి గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సర్కారును కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, జేఏసీ నాయులు మద్దుల బాల్‌రెడ్డి, దోమడుగు బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి,రవీందర్‌రెడ్డి, పీ.శ్రీనివాస్‌రెడ్డి, కుమ్మరి ఆంజనేయులు, మన్నె రామకృష్ణ, కొరివి సురేశ్, కొత్తపల్లి మల్లేశ్ గౌడ్, ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు

- మళ్లీ మొదటికివచ్చిన మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికుల సమస్య
- వేతనాలు చెల్లిస్తామని చెప్పి మాటతప్పిన అధికారులు, కాంట్రాక్టర్
- ఆందోళన బాటలో మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులు
- 75 గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా

న్యాల్‌కల్ మండలం రాఘవపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ వద్ద అందోళన చేస్తున్న భగీరథ కార్మికులు

జహీరాబాద్, ఏప్రిల్ 1: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులు వేతనాల చెల్లింపులో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మళ్లీ ఐదోసారి ఆందోళన బాటపట్టారు. మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులకు కొన్ని నెలలకు సంబంధించిన వేతనాలను అందజేసి, మిగిలిన ఎనిమిది నెలలకు సంబంధించి గతనెల 28వ తేదీలోగా చెల్లిస్తామని సంబంధింత జిల్లా అధికారులు, కాంట్రాక్టర్ తాత్కాలిక కార్మికులకు హామీ ఇచ్చారు. నాలుగు రోజులుగా వేతనాల కోసం కార్మికులు ఎదురుచూసిన అధికారులు, కాంట్రాక్టర్ నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. మంగళవారం నుంచి న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ శివారులోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ నుంచి ఆయా గ్రామాలకు అయ్యే మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు సంబంధిత మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులు స్పష్టం చేశారు. దీంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాల్లో దాదాపు 75 గ్రామాల ప్రజలకు మళ్లీ క'న్నీటి కష్టాలు' మొదలయ్యాయి. అసలే ఎండాకాలం బిందుడే నీళ్ల కోసం నానా అవస్థలు పడుతున్న తరుణంలో మిషన్ భగీరథ కార్మికులు తాగునీటి సరఫరా నిలిపివేయడంతో కష్టాలు తప్పవని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు కార్మికులకు వేతనాలు చెల్లించి, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా మండలాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరాలు

స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 31: తారా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు 2,3,4 ఆధ్వర్యంలో మండల పరిధిలోని కలబ్‌గూర్ చింతలపల్లి, అంగడిపేట దత్తత గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా మంగళవారం ఐదో రోజు సామాజిక సేవలో యువత పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డాక్టర్ కూణ వేణు మాట్లాడుతూ యువత లక్ష్యాన్ని నిర్ణయించుకొని, ఆత్మసాక్షిగా కష్టపడితే విజయం సొంతం అవుతుందన్నారు. దత్తత గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిస్వార్థంగా సామాజిక సేవలు అందించడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో స్వచ్ఛ భారత్, సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించడం గొప్ప విషయమన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. పరసర ప్రాంతాలను స్వచ్ఛ భారత్ కింద శుభ్రం చేశారు. అంగడిపేట, కలబ్‌గూర్ గ్రామాల్లో అజిత్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో డిజైరబుల్ ఇండియన్ యువత పాత్ర అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వాణి, అజిత్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సుజాత, సభ్యులు మనోహర్‌రెడ్డి, లావణ్య, అఖిల, జ్ఞాన ప్రబోదిని సంస్థ కార్యదర్శి అమోల్ గాన్జి, గ్రామస్తులు, విద్యార్థులు ఉన్నారు.

చౌకధరల దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ

మాట్లాడుకున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 1: జిల్లాలోని అన్ని మండలాల్లో చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం తెలిపారు. ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాలకు సన్నబియ్యం పౌర సరఫరాల శాఖ గోదాముల నుంచి సరఫరా జరిగినట్లు వెల్లడించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ప్రజా ప్రతినిధులు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నందున ఈ పథకాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని 846 రేషన్ దుకాణాల ద్వారా 3,78,728 రేషన్ కార్డులకు 79987.81 క్వింటాళ్ల రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ తెలిపారు.

హత్నూరలో పంపిణీ ప్రారంభం

హత్నూర, ఏప్రిల్ 1: ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించగా మండలకేంద్రమైన హత్నూరలో తహసీల్దార్ ఫర్వీన్‌షేక్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీలర్లకు సూచించారు. మండలవ్యాప్తంగా 38 రేషన్ షాపుల్లో 15,275 రేషన్ కార్డులకు 1,722 క్వింటాళ్ల సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సమస్యల వలయంలో వట్‌పల్లి

- మండలంలో పడకేసిన పారిశుధ్యం
- పత్తాలేని ప్రత్యేకాధికారులు
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇబ్బందిపడుతున్న ప్రజలు

ఉసిరికపల్లిలో సీసీ రోడ్డుపై పశువులు, పెంటకుప్పలు

వట్‌పల్లి, ఏప్రిల్ 1: కాంగ్రెస్ హయాంలో వట్‌పల్లి మండలం సమస్యల వలయంగా మారింది. మండలకేంద్రంతోపాటు ప్రతి గ్రామంలో పారిశుధ్య సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. గ్రామాలకు ఎంపిక చేసిన ప్రత్యేక అధికారులు గ్రామాలకు రావడం లేదు. ఫోన్‌లో సమస్యలు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అధికారులు సమస్యలు తీర్చడంలేదని ప్రజలు మం డిపడుతున్నారు. గ్రామాల్లోని చిన్న చిన్న సమస్యలు తీర్చడానికి సైతం నిధులు లేవని కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ప్రతి గ్రామంలో డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశుధ్య పనుల్లో మొదటి స్థానం డ్రైనేజీలకు కేటాయిస్తే అలాంటి డ్రైనేజీల సమస్యలే ఎక్కగా ఉన్నాయి. గ్రామాల్లో ఎక్కడిక్కడ చెత్తకుప్పలు కనిపిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. గ్రామాల్లోని సీసీ రోడ్లపైనే పశువులు కట్టేయడం, ఊరి మధ్యలో చెత్త కుప్పలు వేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోడంతో పారిశుధ్య సమస్యలు అధికమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం నియమించిన గ్రామాల ప్రత్యేకాధికారుల గ్రామాలను సందర్శించి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు కొలువులు సాధించిన హేమలత

రామచంద్రాపురం, ఏప్రిల్ 1: మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటారు ఆర్సీపురం ప్రాంతానికి చెందిన వీరరాపు హేమలత. డివిజన్‌లోని మల్లికార్జుననగర్‌కాలనీలో నివాసముండే హేమలత చిన్ననాటి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. పటాన్‌చెరులోని ఎస్‌టీ జోసెఫ్స్ హైస్కూల్‌లో పదో తరగతి పూర్తిచేసింది. బీహెచ్‌ఈఎల్‌లోని హోలీక్రాస్ కాలేజీలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసింది. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ(జువాలజీ) చదివింది. ఆమె భర్త హరికృష్ణ ప్రోత్సాహంతో 2019లో టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజయం సాధించి మెదక్ జిల్లా కొల్చారంలో గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. ఆ తర్వాత 2019లో మరోసారి టీఆర్‌ఈఐఆర్‌బీ నిర్వహించిన పరీక్షల్లో విజయం సాధించినప్పటికీ, అందులో చేరకుండా లెక్చరర్‌గానే పనిచేశారు. 2025లో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ పోస్టులకు పరీక్ష రాసి ఉద్యోగం సాధించింది. సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచి సాధించాలనే తపనతో చదివానని, లక్ష్యా న్ని పెట్టుకుని కొలువు సాధించినట్లు హేమలత తెలిపారు.

ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ

శ్రీరామనవమి ఉత్సవాలకు ఆహ్వానం

జిన్నారం, ఏప్రిల్ 1: మండలకేంద్రంలోని కోదండ రామాలయంలో 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని నిర్వహించనున్న కల్యాణోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని గుమ్మడిదలలో కలిసి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

సరిహద్దుల్లో అక్రమ రవాణాను అరికట్టాలి

జహీరాబాద్, ఏప్రిల్ 1: తెలంగాణ–కర్ణాటక సరిహద్దు ప్రాంతాల గూండా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ పారితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లతోపాటు కోహీర్ పోలీస్‌స్టేషన్లకు ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్ల నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. హిస్టరీ షీటర్లను రెగ్యులర్‌గా తనిఖీ చేస్తూ, రికార్డుల్లో అప్‌డేట్ చేయాలని సూచించారు. అండర్ ఇన్వెస్టిగేషన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. ముఖ్యంగా మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులకు అదేశించారు. జహీరాబాద్, కోహీర్, చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన తెలంగాణ–కర్ణాటక ప్రాంతాల గుండా అక్రమ రవాణా జరగకుండా చర్య లు తీసుకోవాలన్నారు. సరిహద్దు ప్రాంతాలతోపాటు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ ప్రధాన రోడ్డు మార్గాల్లో వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, దీని కోసం బ్లాక్ స్పాట్లను గుర్తించి సైన్‌బోర్డులను ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, బెట్టింగ్ యాప్స్, సైబర్ నేరాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హిస్టరీ షీటర్లు, సంఘ విద్రోహశక్తులు, అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని, శాంతిభద్రతలకు విఘా తం కలిగిస్తే సహించేదిలేదని, వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. జహీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పరిసరాల శుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐలు కాశీనాథ్, ప్రభాకర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

జహీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ పారితోశ్ పంకజ్

IN THE COURT OF THE HON 'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE – CUM - X ADDITIONAL MAGISTRATE OF FIRST CLASS AT : MEDCHAL ATHEVELLY

O.S.No.265 OF 2023

BETWEEN:
V. Vishnuvardhan and others ...Plaintiffs
AND
Kalali Harishanker Goud and others ...Defendants.

To
Defendant No.1: Kalali Harishanker Goud S/o. Venka Goud, Aged 57 Years, Occ: Business, R/o. H.No. 4-7-63, APSEB Colony, Sangareddy District, Telangana State.
Defendant No-2: K. Venkatesh S/o. Late Kuppu Swamy, Aged 65 Years, Occ: Business, R/o. H.No. 12-11-1125, Warasiguda, Secunderabad, T.S.
Defendant No.4: Smt. Chukka Padmavathi W/o. Balraj Goud, Aged 57 Years, Occ: Business, R/o.B-64, Durgabai Deshmukh Colony, Hyderabad- 67.

Please take notice that the Plaintiff has filed above suit for Declaration and Perpetual Injunction against Defendants. The Defendants No. 1,2 and 4 in the above suit several times summons were issued and deliberately avoiding, thereafter the Hon 'ble Court has ordered to substitute the services in the News Paper. Now the matter stands posted on 01-05-2025 at 10.30 A.M. for your appearance either in person or through advocate, failing which the matter would be decided as per law.

(BY ORDER OF THE COURT)
Sd/- K.S. KUMAR, JITHENDER
ADVOCATES
Office: H.No. 10-1-626/A, Ground Floor, East Marredpally, Secunderabad-500026.
Cell: 9966971155

రాష్ట్ర బాస్కెట్ బాల్ అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి

సంగారెడ్డి, మార్చి 1: రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో జిల్లాకు చెందిన శ్రీధర్‌రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇటీవల రాష్ట్ర కమిటీకి జరిగిన ఎన్నికలల్లో బాస్కెట్ బాల్ అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు న్యాయమూర్తి నవీన్‌రావు రిటర్నింగ్ అధికారిగా, ఒలింపిక్ అసోసియేషన్ అధికారి, స్పోర్ట్స్ ఆథారిటీ అధికారి అబ్జార్వర్లుగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రమోహన్ గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, అబ్దుల్ హఫీజ్‌ఖాన్, విజయ సారథి, ప్రధాన కార్యదర్శిగా పృథ్వీశ్వర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా విష్ణుకుమార్ గౌడ్, మహమ్మద్ సమీయొద్దీన్, అసోసియేట్ కార్యదర్శులుగా ఫ్రాన్సిస్ సుకుమార్, నర్సుల్లా హైదర్ మహమ్మద్, కోశాధికారిగా చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసిన మైనార్టీలు

సంగారెడ్డి అభివృద్ధికి కృషి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 1: అధికారంలో ఉన్నా లేకున్నా సంగారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను పలువురు మైనార్టీ నాయకులు మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా అని పేర్కొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

జిన్నారం, ఏప్రిల్ 1:అనుమతులు లేకుండా అక్రమంగా ప్రభుత్వ భూముల్లోంచి మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను జిన్నారం పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్సై నాగలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రం సమీపంలోని సర్వే నంబర్–1 హెచ్ఎండీఏ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారనిహెచ్ఎండీఏ అధికారులు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు టిప్పర్ డ్రైవర్ అనుమతి పత్రాలు చూపకపోవడంతో మట్టి టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కారంపొడి చల్లి..బంగారు గొలుసు లాక్కెళ్లి..

రామచంద్రాపురం, ఏప్రిల్ 1: బైక్‌ను వెంబడించి కండ్లల్లో కారంపొడి చల్లి బంగారు పుస్తెలతాడును దుండగులు లాక్కెళ్లిన ఘటన సోమవారం రాత్రి భెల్ పరిసరాల్లో చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్లితే..భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీకి చెందిన ఆరోగ్యమ్మ(45) సోమవారం రాత్రి 10:30గంటల సమయంలో కడప జిల్లాకు వెళ్లేందుకు బస్సు కోసం లింగంపల్లికి తన సోదరుడి కుమారుడు సూర్యతేజతో కలిసి బైక్‌పై వెళ్తుంది. వారిని మరో ఇద్దరు బైక్‌పై వెంబడిస్తున్నట్లు గమనించిన సూర్యతేజ బైక్ స్పీడ్‌ను పెంచాడు. భెల్ పరిసరాల్లోకి వెళ్లగానే చీకట్లో సూర్యతేజ బైక్‌ను దుండగులు ఠక్కర్ ఇవ్వడంతో ఇద్దరు పడిపోయారు. దీంతో దుండగులు వారిపై కారంపొడి చల్లి ఆరోగ్యమ్మ మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయ్యారు. దీంతో ఆమె ఆర్సీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సైను గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు

జిన్నారం, ఏప్రిల్ 1: రెండు రోజుల క్రితం మండలకేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐని గాయపర్చి, తప్పించుకునే ప్రయత్నంలో మరో కారును ఢీకొట్టి పారిపోయిన వ్యక్తి ఆచూకీని పోలీసులు మంగళవారం గుర్తించారు. ఎస్సై నాగలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ ఉసికె బాయికి చెందిన నర్సింగ్ రావుపై ఎస్ఐ నాగలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇప్పెపల్లిలో విషాదం

ఒకే రోజు గుండెపోటుతో ఇద్దరు యువకులు మృతి

జహీరాబాద్, ఏప్రిల్ 1: ఒకే రోజు గుండెపోటుతో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఇప్పెపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీనివాస్(27) అనే యువకుడు ఉదయం మండలంలోని మన్నాపూర్ గ్రామంలో కార్పెంటర్ దుకాణాన్ని తెరిచి శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలి పడిపోయాడు. వెంటనే దవాఖానకు తరలించే క్రమంలో మృతి చెందాడు. తొమ్మిది నెలల క్రితం మృతుడి అన్న కూడా గుండెపోటు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన మరో యువకుడు అలిగేరి నగేశ్(28) ఇంటి పరిసరాల్లో నిల్చున్న చోటే గుండెపోటుకు గురై కుప్పకూలి పడిపోయి మృతిచెందారు. ఒకేరోజు ఇద్దరు యువకులు గుండెపోటుతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోధనలు కంటతడిపెట్టించాయి.

పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సిర్గాపూర్, ఏప్రిల్ 1: సిర్గాపూర్ మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండాలో బీఆర్‌ఎస్ కార్యకర్త మృతి చెందాడు. మంగళవారం విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీ తరపున కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

రామచంద్రాపురం, ఏప్రిల్ 1: రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందిన ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ మున్సిపాలిటీ బీరంగూడకు చెందిన అంకెపల్లి శ్రీశైలం కుమారుడు శ్రీనాథ్ అశోక్ లేల్యాండ్ వాహనాన్ని కొనుగోలు చేసి ఆర్సీపురం డివిజన్‌లోని జ్యోతినగర్‌లో ఉన్న గంగమ్మ ఆలయం వద్ద వాహనానికి పూజ చేయించాలని తండ్రికి తెలియజేశాడు. దీంతో శ్రీశైలం, తన కూతురు శిరీష(22)ను తీసుకొని స్కూటీపై ఆలయానికి బయలుదేరారు. ఈ క్రమంలోనే బీరంగూడ కమాన్ జాతీయ రహదారిపై హైటెక్ బావర్చీ హోటల్ సమీపంలో వెనుకాల నుంచి అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం స్కూటీని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిని పక్కనే ఉన్న ప్రైవేట్ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ శిరీష మంగళవారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.